RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 53 సోమవారం 06 - 10 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ


- పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన
- ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్
- ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ



తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. - మిగతా 2 లో

## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరిక
- మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన
- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోవద్దని స్పష్టీకరణ
- మోసగాళ్లు వాటిని సులభంగా దుర్వినియోగం చేస్తారని వెల్లడి
- ఎవరినైనా నమ్మేముందు ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని సలహా
- జిటో కనెక్ట్ 2025లో మహిళా పారిశ్రామికవేత్తలతో సీపీ భేటీ



2 లో

## గ్రీన్ జర్నీ పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారు



2 లో

- ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు
- సీఎం రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శలు
- రాష్ట్రంలో బస్సు చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి
- గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యులను దోచుకుంటోందని ఆరోపణ
- బస్సు ఎక్కాలంటేనే భయపడే పరిస్థితి కల్పిస్తున్నారని మండిపాటు
- సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు


## నేపాల్‌లో భారీ వర్షాలకు
# 51 మంది బలి

- అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ
- పలువురు గాయపడగా అనేకమంది గల్లంతయ్యారు
- అత్యధికంగా ఇల్లాం జిల్లాలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు
- పలువురు గాయపడగా అనేకమంది గల్లంతు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది
- తూర్పు నేపాల్‌లో గత24 గంటల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో ఈ మరణాలు సంభవించాయి



నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య 51కి చేరింది. తూర్పు నేపాల్‌లో గత24 గంటల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో ఈ మరణాలు సంభవించాయి. అత్యధికంగా ఇల్లాం జిల్లాలో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. సూర్యోదయ, మంగ్సేబంగ్, దేవ్ మై ప్రాంతాల్లోనూ మరణాలు నమోదయ్యాయి. పలువురు గాయపడగా అనేకమంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యంతో పాటు పోలీసులు, ఇతర సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లోని వానలకు కాఠ్ మాండూ లోయలోని భాగమతి, బిష్ణుమతి సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాల్లోకి వరదనీరు చేరుతోంది. నదీ పరివాహక ప్రాంతాల్లోని రోడ్లపై ప్రయాణాలు చేయవద్దని ప్రజలను అధికారులు సూచించారు. కాఠ్ మాండూ సహా అనేక జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసి, ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ విభాగం - మిగతా 2 లో

## విశాఖ బీచ్ లో ఇటలీ పర్యాటకుల గల్లంతు, ఒకరి మృతి



- విశాఖ యారాడ బీచ్‌లో తీవ్ర విషాదం
- సముద్రంలో కొట్టుకుపోయిన నలుగురు ఇటలీ పర్యాటకులు
- అలల ధాటికి ఒకరు మృతి, మరొకరు సురక్షితం
- గల్లంతైన మరో ఇద్దరి కోసం కొనసాగుతున్న గాలింపు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్న యారాడ తీరం
- గతేడాది కూడా ఇటలీ పర్యాటకులు ప్రమాదానికి గురైన వైనం

నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన యారాడ బీచ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన ఇటలీ పర్యాటకులలో ఒకరు మృత్యువాత పడగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే, ఇటలీకి చెందిన 16 మంది పర్యాటకుల బృందం యారాడ బీచ్‌కు విహారయాత్రకు వచ్చింది. వీరిలో నలుగురు సముద్రంలో ఈత కొట్టేందుకు దిగారు. ఆ సమయంలో అలల ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. - మిగతా 2 లో

## విజయ్ ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు



2 లో

- విజయ్ కరూర్ సభలో తీవ్ర విషాదం..
- 41 మంది మృతి
- సభకు ముందే ప్రచార రథం కిందపడి
- ఇద్దరికి గాయాలు
- రోడ్డు ప్రమాదం ఘటనలో విజయ్ ప్రచార వాహనం సీజ్

## 'డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయండి'

- వ్యవసాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- జాతీయంగా, అంతర్జాతీయంగా ఎక్కువ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలన్న సీఎం చంద్రబాబు
- పూర్వోదయ పథకాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్న సీఎం
- పూర్వోదయ స్కీంను సద్వినియోగం చేసుకోవాలన్న సీఎం చంద్రబాబు
- ఏపీలో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ప్రోత్సహించాలని సూచన
- సామూహిక పశువుల షెడ్ల నిర్వహణ బాధ్యత డ్వాక్రా సంఘాలకు అప్పజెప్పాలన్న సీఎం
- ఉద్యాన పంటలు, మైక్రో ఇరిగేషన్, ఫిషరీస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చంద్రబాబు చర్చించారు



జాతీయంగా, అంతర్జాతీయంగా ఎక్కువ డిమాండ్ ఉన్న ఉత్పత్తులపై అధ్యయనం చేసి, ఎగుమతులకు అనుగుణంగా ఉన్న పంటలనే సాగు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. పంటల డిమాండును ముందే అంచనా వేసి అందుకు అనుగుణంగా సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. ప్రధానంగా కేంద్రం ప్రారంభించిన పూర్వోదయ పథకాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని చంద్రబాబు తెలిపారు. ఉండవల్లి నివాసంలో ఉద్యాన పంటలు, మైక్రో ఇరిగేషన్, ఫిషరీస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చంద్రబాబు చర్చించారు. పూర్వోదయ మిషన్‌లో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూపొందించాల్సిన ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. "ఉత్పత్తులకు విలువ జోడించడం ద్వారా మార్కెట్ పరిధిని విస్తరించాలి. ప్రధాన పంటలతో పాటు అంతరపంటల ద్వారా కూడా రైతుల ఆదాయం రెట్టింపు చేయొచ్చు. మన వాతావరణంలో పండించగలిగే పంటల్ని అధ్యయనం చేసి, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలి" అని పేర్కొన్నారు. - మిగతా 2 లో

## చైల్డ్ కేర్ సెంటర్‌లో శిశువు మరణంపై విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం

- అనంతపురం శిశుగృహంలో ఏడాదిన్నర చిన్నారి మృతి
- మన్యం జిల్లా గురుకులంలో 85 మంది విద్యార్థినులకు అస్వస్థత
- రెండు ఘటనలపైనా తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు
- మంత్రితో మాట్లాడి, సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ
- చిన్నారి మృతిపై కలెక్టర్ త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శించిన మంత్రి సంధ్యారాణి



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అనంతపురంలోని ప్రభుత్వ శిశుగృహంలో ఏడాదిన్నర బాలుడు మృతి చెందడం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గురుకుల పాఠశాలలో 85 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడంపై ఆయన ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతపురం శిశుగృహంలో జరిగిన బాలుడి మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. సిబ్బంది మధ్య ఉన్న వివాదాల కారణంగానే పసికందుకు సరిగా ఆహారం - మిగతా 2 లో

# సంపాదకీయం

## లద్దాఖ్ జనఘోష



అలజడి రేగినప్పుడూ, అశాంతి జాడలు కనబడినప్పుడూ సకాలంలో దాన్ని చక్క దిద్దటమే పాలకుల ప్రథమ కర్తవ్యం కావాలి. వేరే దేశాలతో సరిహద్దులున్న ప్రాంతాల్లో ఇది మరింత అవసరం. ఆ దృష్టి లేకపోవటం వల్లే చైనా సరిహద్దుల్లో ఉన్న లద్దాఖ్‌లో సాగుతున్న ఉద్యమం అదుపు తప్పి హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు బీజేపీ కార్యాలయాన్ని దగ్ధం చేయటంతో పాటు కొన్ని వాహనాలకు కూడా నిప్పుపెట్టారు. ఇళ్లు, దుకాణాలపై దాడులు చేశారు. సీఆర్‌పీఎఫ్ కాల్పుల్లో నలుగురు మరణించారు. కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. 2019లో జమ్మూ%–%కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసి, జమ్మూ, కశ్మీర్‌ను చట్టసభ గల కేంద్ర పాలిత ప్రాంతంగా, లద్దాఖ్‌ను చట్టసభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చినప్పుడు ఈ ఆందోళనకు బీజం పడింది. లద్దాఖ్‌ను రాష్ట్రం చేసి చట్ట సభ ఏర్పాటు చేయాలని, ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌ను తమకూ వర్తింప చేయాలని లద్దాఖ్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగంలోని 244వ అధికరణం కింద ఉన్న ఆరో షెడ్యూల్ పరిధిలోకి లద్దాఖ్‌ను తీసుకొస్తే శాసన, న్యాయ, పాలనాపరమైన నిర్ణయాలు తీసుకొనే స్వయంపాలిత జిల్లా మండళ్లు ఏర్పడతాయి. అవి లేనట్టయితే పరిశ్రమల స్థాపన పేరిట భూములు బయటివారికి పోతాయనీ, వారి ప్రాబల్యం పెరుగుతుందనీ ఉద్యమకారులు చెబుతున్నారు. గత అయిదేళ్లుగా ఎంతో శాంతియుతంగా ఉద్యమం కొనసాగుతోంది. దీనికి లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమాక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నాయకత్వం వహిస్తున్నాయి. ఉద్యమాలు జరుగుతున్నప్పుడు వాటిని స్వప్రయోజనాలకు వినియోగించుకోవాలని చూసేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి శక్తులకు అవకాశమీయరాదనుకుంటే సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాన్ని అన్వేషించాలి. లద్దాఖ్ ఉద్యమ డిమాండ్లు చూస్తే అవి గొంతెమ్మ కోరికలేమీ కాదని తెలుస్తుంది. ఈ ప్రాంత యువతకు ప్రభుత్వోద్యోగాల్లో అన్యాయం జరగకూడదనుకుంటే లద్దాఖ్‌కు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జమ్మూ – కశ్మీర్‌లో భాగంగా ఉన్నప్పుడు అక్కడి సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలుండేవి. కేంద్రపాలిత ప్రాంతమైనాక అది కాస్తా పోయింది. మూడేళ్ల పాటు నిరుద్యోగులు ఆశగా ఎదురుచూశాక కేంద్ర సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) రంగంలోకి దిగింది. కానీ ఆ ప్రక్రియ ఒక కొలిక్కి రావటానికి ఎంతో సమయం పట్టింది. నిరుడు ఎస్సెస్సీ 797 పోస్టుల భర్తీకి ప్రకటనిస్తే 30,000 మంది దరఖాస్తు చేశారు. 2021%–22, 2022–%23 మధ్య పట్టభద్రుల్లో నిరుద్యోగిత ఒక్కసారిగా 16 శాతం పెరిగింది. పలువురికి వయఃపరిమితి దాటింది. దానికి తోడు స్వయంపాలిత మండళ్లు రెండున్నా... వాటిలో స్థానికేతర అధికారుల హవా నడుస్తోంది. సహజంగానే రాజకీయ వ్యవస్థకు చోటు లేదు గనుక పార్టీలు సైతం ఈ ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నాయి. లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తితో పాటు దాని పరిధిలోని లేహ్, కార్గిల్‌లకు రెండు పార్లమెంటరీ స్థానాలు ఇవ్వాలని ఉద్యమకారులు కోరటం గమనించదగ్గది. భౌగోళికంగా పర్వతప్రాంతం, తీవ్ర వాతావరణ స్థితిగతుల వల్ల అక్కడ పరిశ్రమల స్థాపనకు వచ్చేవారు తక్కువ. 13 గిగావాట్ల సౌరశక్తి ప్లాంట్‌కు లేహ్‌లోని పాంగ్ ప్రాంతంలో అనుమతించారు. కానీ దానికి దాదాపు 80 కిలోమీటర్ల ప్రాంతం కావాలి. ఈ ప్రాజెక్టు వస్తే పశుపోషణపై, సంచారజాతుల వారిపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, జీవిక దెబ్బతింటుందనీ ఉద్యమకారుల ఆరోపణ. అసలే పర్యావరణం క్షీణించి అకాల వర్షాలూ, అత్యధిక ఉష్ణోగ్రతలతో హిమానీనదులు కొడిగడుతున్న నేపథ్యంలో ఇలాంటి పరిశ్రమలు అవసరం లేదన్నది వారి వాదన. ఉద్యమకారుల డిమాండ్లలో హేతుబద్ధమైన వాటిని తక్షణం పరిష్కరించటం, మిగిలినవాటిపై పరిశీలనకు తగిన వ్యవస్థను ఏర్పాటు చేయటం అవసరమని ఇప్పటికైనా పాలకులు గ్రహించాలి. ఉద్యమ నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థపై వెంటనే చర్యలు మొదలుపెట్టడం సబబేనా? హింసకు ఆయనే కారకుడని తేలితే వేరే విషయం. తగిన విచారణ జరిగితే అన్నీ బయటికొస్తాయి. ఉద్యమం మరింత తీవ్రం కాకూడదనుకుంటే అంతవరకూ ఓపిక పట్టడం అత్యవసరం.

## చైల్డ్ కేర్ సెంటర్‌లో శిశువు మరణంపై విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం

అందించడంలో నిర్లక్ష్యం వహించారని, అదే చిన్నారి మృతికి దారితీసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని హడావుడిగా ఖననం చేశారన్న విమర్శలు కూడా వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గానికి చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన బిడ్డను సెప్టెంబర్ 30న శిశుగృహంలో చేర్పించారు. పుట్టుకతోనే తక్కువ బరువుతో ఉన్న ఆ చిన్నారి, దసరా రోజు (అక్టోబర్ 2న) విరేచనాలతో మృతి చెందాడు. అనంతపురం ఘటనపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విచారణకు ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి పీడియాట్రిక్ హెచ్ఓడీలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. శిశుగృహం మేనేజర్‌తో పాటు ఆయాలకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మెమోలు జారీ చేశారు.

## విశాఖ బీచ్ లో ఇటలీ పర్యాటకుల గల్లంతు, ఒకరి మృతి

ఇది గమనించిన లైఫ్ గార్డులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టమ్మీద ఇద్దరిని ఒడ్డుకు చేర్చగలిగారు. ఒడ్డుకు చేర్చిన ఇద్దరికీ లైఫ్ గార్డులు వెంటనే సీపీఆర్ చేశారు. వారి ప్రయత్నం ఫలించి ఒక పర్యాటకుడు ప్రాణాలతో బయటపడగా, మరొకరు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గల్లంతైన మిగతా ఇద్దరి ఆచూకీ కోసం రెస్క్యూ సిబ్బంది సముద్రంలో ముమ్మరంగా గాలిస్తున్నారు. యారాడ బీచ్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా చాలామంది పర్యాటకులు అలల ధాటికి సముద్రంలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. సరిగ్గా గత ఏడాది సెప్టెంబర్‌లో కూడా 8 మంది ఇటలీ పర్యాటకులు ఇలాగే సముద్రంలో కొట్టుకుపోగా, లైఫ్ గార్డులు సకాలంలో స్పందించి వారందరినీ సురక్షితంగా కాపాడారు. ఈ తాజా ఘటనతో యారాడ తీరంలో భద్రతా చర్యలపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.

## విజయ్ ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు



ఇటీవల తమిళనాడులోని కరూర్ ప్రాంతంలో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ నిర్వహించిన సభలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది మరణించగా, 80 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమ విచారణను వేగవంతం చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, విజయ్‌కు మరో షాక్ తగిలింది. కరూర్ సభ జరగడానికి కొన్ని గంటల ముందు విజయ్ ప్రచార రథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తాజాగా ఆ ప్రచార రథాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను విచారిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## ‘డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయండి’

అంతేకాకుండా ప్రతి రైతునూ పరిశ్రమలకు అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని వివరించారు. ఈ విధంగా చేసినట్లయితే ఏ విధమైన పంటనష్టం వాటిల్లదని చంద్రబాబు అధికారులకు తెలిపారు. ఈ మేరకు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ప్రోత్సహించాలని అన్నారు. వీటికి కేంద్రం ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. ఉద్యానరంగ రైతులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఇలా అందరికీ కలిసొచ్చేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్ని రకాలైన ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వచ్చేలా చూడాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ వర్సిటీ: రాష్ట్రంలో ఆక్వాకల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆక్వా ఉత్పత్తుల



సాగు అంతకు రెట్టింపయ్యేలా చర్యలు తీసుకోవాలని వివరించారు.

రైతు సేవాకేంద్రాల పరిధిలో ఏయే పంటలు ఉన్నాయనే విషయాన్ని విశ్లేషించి, రైతులకు అవగాహన కల్పించేలా కేంద్రాల్లోని సిబ్బందిని సన్నద్ధం చేయాలన్నారు. క్లస్టర్ ఆధారంగా పశువులకు సామూహిక షెడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అయితే వీటి నిర్వహణను మాత్రం డ్వాక్రా సంఘాలకు అప్పగించాలని అన్నారు. వీటికి అనుబంధంగా పాల ఉత్పత్తి యూనిట్లు, చిల్లింగ్ యూనిట్లు, దాణా బ్యాంకులు, బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేపాల్‌లో భారీ వర్షాలకు 51 మంది బలి

హెచ్చరికలు జారీ చేసింది.

**ప్రధాని మోదీ విచారం**

నేపాల్‌లో సంభవించిన ప్రకృతి విపత్తుపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్ ప్రజలకు భారత్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అక్కడి ప్రజలకు అవసరమైన సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఎక్స్? వేదికగా తెలిపారు.

**భూటాన్‌లో భారీ వర్షాలు**

మరోవైపు కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల పొరుగుదేశం భూటాన్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదీ పరివాహ ప్రాంతాల్లో ఆకస్మిక వరదల కారణంగా వేలమంది ప్రజలు వరదల్లో చిక్కుకుపోయారు. దీంతో అక్కడి ప్రజలకు సహాయం అందించేందుకు భారత సైన్యం రంగంలోకి దిగింది. భూటాన్ అధికారులు, భారత సైనికులు సంయుక్తంగా చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న భూటాన్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల ప్రతికూల వాతావరణం ఏర్పడి బాధితులను తరలిస్తున్న భూటాన్ హెలికాప్టర్ పని చేయకపోవడంతో ఆ దేశం భారత్‌ను అత్యవసరం సాయం కోరిందని అధికారిక వర్గాలు వివరించాయి. దీంతో వెంటనే స్పందించిన భారత్ సైన్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా తరలించింది. వారికి తక్షణ వైద్య సహాయం అందేలా రెండు హెలికాప్టర్లను మోహరించిందని తెలిపాయి.

**భూటాన్ వరదలతో డార్జిలింగ్ అతలాకుతలం**

భూటాన్?లో భారీ వర్షాలు కురుస్తుండడంతో పక్కనే ఉన్న బంగాల్?తో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. నదులు ఉప్పొంగుతున్నాయని ఫలితంగా భూటాన్? పక్కనే ఉన్న బంగాల్?తో పాటు సిక్కిం రాష్ట్రాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈ క్రమంలోనే బంగాల్‌లోని ఉత్తర ప్రాంతాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేశాయి. భూటాన్‌లో



కుండపోతకు వరద పోటెత్తగా డార్జిలింగ్ ప్రాంతంలో జోరు వానలకు కొండచరియలు విరిగిపడి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువమంది చిన్నారులే ఉన్నారు. పెద్దఎత్తున ఇళ్లు ధ్వంసమవగా పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతైనట్లు తెలుస్తోంది. వారిని కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు కొనసాగుతున్నాయి.

## సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ



రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.


## డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

డిజిటల్ ప్రపంచం ఓ మాయాజాలం... ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అంతే స్థాయిలో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి... ముఖ్యంగా మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన ‘ఎక్స్’ ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. “చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి




సంఖ్య పెరిగిపోతోంది” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తున్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. “ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి” అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. “వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం” అని ఆయన ప్రశంసించారు. అక్టోబర్ 3న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించిన ఈ జిటో కనెక్ట్ 2025 ప్రదర్శన మూడు రోజుల పాటు సాగనుంది. ఇందులో 600కు పైగా స్టాళ్లు, ఆరు భారీ అరీనాలు ఏర్పాటు చేశారు. బిల్డ్ మార్ట్, బిజినెస్ బే, ప్రాపర్టీ పెవిలియన్ వంటి విభాగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో బాబా రాందేవ్, కమలేశ్ పటేల్ (దాదాజీ), సినీ నటుడు బొమన్ ఇరానీ, క్రికెటర్ సూర్య కుమార్ యాదవ్, కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ వంటి పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

## గ్రీన్ జర్నీ పేరుతో ప్రజల రక్తం పీలుస్తున్నారు



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సామాన్య ప్రజలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకంత కోపమని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. “గ్రీన్ జర్నీ పేరుతో ప్రభుత్వం సామాన్యుల రక్తాన్ని పీల్చేస్తోంది. బస్సు ఎక్కడమే పాపం అన్నట్లుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారు” అని కవిత తన పోస్టులో తీవ్రంగా విమర్శించారు. ఇటీవలే బస్సు పాస్‌ల ధరలను పెంచి చిరుద్యోగులు, విద్యార్థులపై పెనుభారం మోపిన ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బస్సు చార్జీలను అమాంతం పెంచేయడం దారుణమని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు సామాన్యుడి నడ్డి విరిచేలా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణాను ప్రజలకు దూరం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ం

## శ్రీశైలం ఆలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల అటవీభూమి

### కేంద్రాన్ని కోరనున్న కూటమి ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైలాన్ని ఒక ప్రధాన ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, అవసరమైన సౌకర్యాల కల్పన కోసం 2,000 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించింది. ఈ నెల 16న శ్రీశైలం పర్యటనకు రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈ అంశంపై చర్చించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దేవాదాయ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. శ్రీశైలానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ సహా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఏటా లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “తిరుమల తర్వాత శ్రీశైలం రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో సరైన పార్కింగ్ వసతి కూడా లేదు. భూమి అందుబాటులో లేకపోతే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం అసాధ్యం” అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2,000 హెక్టార్ల అటవీ భూమిని దేవాదాయ శాఖకు బదలాయించాలని కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖను కోరాలని నిర్ణయించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి వివరించేందుకు ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని కూడా సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, భక్తుల సంఖ్య ఏటా పెరుగుతున్నందున ఆలయ సమగ్రాభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న శబరిమల వంటి పుణ్యక్షేత్రాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధ్యయనం చేసి, శ్రీశైలంలో ఆ తరహా ఏర్పాట్లు చేయాలని ఆయన ప్రతిపాదించారు. అభివృద్ధి ప్రణాళికలో భాగంగా శ్రీశైలానికి జాతీయ రహదారులతో అనుసంధానం కల్పించాలని సీఎం సూచించారు. దోర్నాల, సుండిపెంట, ఈగలపెంట తదితర ప్రాంతాల మీదుగా జాతీయ రహదారులను ఆలయానికి అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. అయితే, అభివృద్ధి పనులతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన నొక్కిచెప్పారు. ఆలయాల చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాలను కాపాడతామని, పచ్చదనాన్ని పెంచేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శ్రీశైలం టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్యను పెంచేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

# నిరాశ్రయులు, సంచార జాతులవారికి దుస్తులు, ఔషధాలు పంపిణి



**సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్:** హైదరాబాద్ మహానగరంలో రోడ్ల పక్కన ఫుట్పాత్ల మీద జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతులను గుర్తించి దుస్తులు, , బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణి చేసి వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఔషధాలను అందించి, ప్రమాదాల బారిన పడిన వారికి ప్రథమ చికిత్సను అందించాము. ఈ కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవాసభ్యులు పాల్గొన్నారు.

# ఇర్ప లింగస్వామి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క



**కొత్తగూడ తెలంగాణ సేన :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం పోలారం లో కాంగ్రెస్ పార్టీ కుటుంబం కు చెందిన ఇర్ప లింగస్వామి ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు వారి కుటుంబ సభ్యులు పరామర్శించి సానుభూతిని తెలిపి మనోధైర్యం కల్పించి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని సంక్షేమ పథకాల్లో భాగంగా మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రూఫ్ సింగ్, డైరెక్టర్ వజ్జ జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుని మృతి పట్ల సంతాపం



**బైంసా:అక్టోబర్ 05:తెలంగాణ సేన న్యూస్.:** బైంసా : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు కుమార్ యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం బైంసా మండలం గ్రామంలో బైంసా డివిజన్ గ్రామీణ వైద్యుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు, వారి మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ ముత్యంరెడ్డి, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం బైంసా డివిజన్ అధ్యక్షులు మోహన్, తానూర్ మండల అధ్యక్షులు రాజు, నాగభూషన్, ప్రసాద్, బైంసా మండల అధ్యక్షులు అర్జున్ పాటిల్, విజయ్ కుమార్, బద్రి నారాయణ,సునీల్, సాయి, కపిల్ దగడే, బ్రహ్మంగావ్ రవీందర్, ముధోల్ తానూర్ బైంసా మండలాల చెందిన ఆర్ఎంపి లు పాల్గొన్నారు,

# మాధవ రెడ్డి పరామర్శించిన మంత్రి సీతక్క.



**హనుమకొండ తెలంగాణ సేన. :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి వారి మాతృమూర్తి కాంతమ్మ అనారోగ్యంతో కాలం చెందారు .. మాధవరెడ్డి ని పరామర్శించి సానుభూతిని తెలిపి మనోధైర్యాన్ని కల్పించి కాంతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించిన మంత్రి సీతక్క.

# ఘనంగా మహిళా గాజుల పండగ

## వంటా వార్పు, ఆట, పాటల నడుమ దోస్తుల గాజులు..





**లోకేశ్వరం: అక్టోబర్ 05: తెలంగాణ సేన న్యూస్.:** లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఆదివారం,: మహిళా దోస్తుల గాజుల పండగ ట్రెండ్ గా మారింది. దోస్తులు గాజులు వేసుకుంటే బాగుంటారన్న సాంప్రదాయంతో ఏకీభవించి మహిళాలు గ్రాండ్ గా ఈ గాజుల పండుగ జరుపు కొంటున్న విషయం విధితమే. ఆదివారం మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన మహిళలు గాజుల పండగను కన్నుల పండువుల నిర్వహించు కొన్నారు. గల్లి మహిళ లందరు స్థానిక ఆదివారం దేవి సన్నిధిలో ఏకరూప దుస్తులను ధరించి, ముందుగా గోరింటాకును ఒకరి నొకరు పెట్టుకొన్నారు. అందరు పసుపు, కుంకుమ, పూలు ధరించి సాంప్రదయ బద్దంగా ఒకరినొకరు వారి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ గాజులు వేసుకొన్నారు. అనంతరం వంటలు చేసుకొని భోజనాలు చేశారు.తదనంతరం కాలక్షేపనికి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని కబాడీ, కోకో తదితరులు ఆటలను ఆడారు.అంత్యక్షరీ, పాటలు పాడుతూ ఆనందోత్సహల మధ్య గాజుల పండగనునిర్వహించుకొన్నారు.

# అకాల వర్షంతో రైతన్నలకు కష్టాలు

## సోయా పంట కాపాడేందుకు ఇబ్బందులు



**తెలంగాణ సేన అక్టోబర్ 05 (బాసర) :** నిర్మల్ జిల్లా :బాసర మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలోనే భారీ వర్షం కురవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సోయా పంట వచ్చిందని ఆరబోయే సమయానికి అకాల వర్షం కురవడంతో రైతన్నలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. వర్షాలు రైతుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మొన్నటి వరకు భారీ వర్షాలతో పంటలు దెబ్బతినగా.. ఇప్పుడేమో చేతికి అందిన సోయా పంట ఆరబోయనీయకుండా వరుణుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎప్పుడొస్తుందో తెలియని వర్షం నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. పంట కుప్పలపై టార్పాలిన్లు కప్పుతూ పంటను కాపాడుకునేందుకుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

# బాసరలో దొంగల బెడద

## –బిక్కుబిక్కుమంటూ అర్ధరాత్రి కాలం వెళ్లదీస్తున్న కాలనీవాసులు

## –గస్తీ చేపడుతున్న గ్రామస్తులు



**తెలంగాణ సేన అక్టోబర్ 05 ( బాసర) :** నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఇటీవల వరుసగా దొంగతనాలు కావడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పలు కాలనీలోని ఇళ్లలోకి దొంగలు చొరబడి విలువైన వస్తువులతో పాటు నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకొని పోయారు. ఇదే క్రమంలో మరోసారి అదే కాలనీలో వరుసగా చోరీ జరగడంతో బిక్కుబిక్కుమంటూ కాలనీవాసులు కాలం వెళ్లదీస్తున్నారు. పోలీసులు గస్తీ తిరుగుతున్నప్పటికీ అడపాదడప చోరీ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వెంకటేశ్వర కాలనీవాసులు అందరూ ఏకమై అర్ధరాత్రి సమయంలో 5 గురు మంది చొప్పున యువకులు గస్తీ తిరుగుతున్నారు. ఏ సమస్య వచ్చిన ఒకరికొకరు సమాచారం తెలుసుకొని కంటిమీద కునుకు లేకుండా కాలనీలో గస్తీ ముమ్మరం చేశారు. ఇప్పటికే దొంగలపాలై తీవ్రంగా నష్టపోయిన వారిని పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. కూత వేటు దూరంలో పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు దొంగలను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

## మంత్రి సీతక్క



**కొత్తగూడ తెలంగాణ సేన ::** మహబూబాబాద్ జిల్లా ఉమ్మడి కొత్తగూడ & గంగారం మండల కేంద్రాల్లో మంత్రి సీతక్క పర్యటన.. రానున్న స్థానిక ఎన్నికల్లో గ్రామ వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి అన్నింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పార్టీ.. కార్యకర్త లేనిది నాయకులు నేతలు లేరు,, కార్యకర్తల సలహాల సూచనల మేరకే అధిష్టానానికి అభ్యర్థుల పేర్లను పంపడం జరుగుతుంది. అధిష్టానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎవరిని నిర్ణయించిన అందరూ దృడ సంకల్పంతో నిస్వార్ధంగా కాంగ్రెస్ పార్టీ ధ్యేయం సంకల్పం కోసం ప్రతి పార్టీ కార్యకర్త పని చేయాలి. అభ్యర్థులు మన మీద నమ్మకంతో పోటీ చేస్తారు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉంటారో వారిని భారీ మెజార్టీ తో గెలిపించుకునే బాధ్యత మనది. ప్రతి కాంగ్రెస్ పార్టీ కష్టపడ్డ కార్యకర్తకు భవిష్యత్తులో మంచి రోజులు ఉంటాయి ఈరోజు పదవులు అనుభవిస్తున్న వారు ఒకనాడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్ అంటేనే కార్యకర్తల పార్టీ రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రభంజనం ఉన్నప్పటికీ ఉమ్మడి కొత్తగూడ గంగారం మండలాల్లో కాంగ్రెస్ పార్టీ జెడ్పిటిసి లో ఎంపీటీసీలు ఎంపీపీలు సర్పంచులు అత్యధిక స్థానాల్లో గెలుపొంది గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో మీరు అన్ని విజయాలతో విజయకేతనం చూపించారు. మన ఉమ్మడి మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎప్పటికి రుణపడి ఉంటుంది కష్టకాలంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కష్టపడ్డారు. వారిని పేరు పేరునా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తుకు పెట్టు కుంటుంది. మీ లాంటి కార్యకర్తల వల్లనే ఈరోజు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చింది. బడుగు బలహీన వర్గాలను నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెట్టింది. గతంలో ఎన్నడు లేని విధంగా రేషన్ కార్డులు అందజేసింది. ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం అందించిన ఘనత మన ప్రజా ప్రభుత్వం.. కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ రాజ్యం ఇందిరమ్మ రాజ్యం అంటేనే ఇందిరమ్మ ఇల్లు ప్రతి గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇల్లు అందించిన ఘనత మన ప్రభుత్వం కు మాత్రమే ఘనత చెందుతుంది. ఆరోగ్యశ్రీ అంబులెన్స్ ఫీజు రియంబర్స్ ముఖ్యమంత్రి సహా నిధి చెక్కులను అత్యధికంగా అందించిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కుతుంది. మన ప్రజా ప్రభుత్వంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత.. వ్యవసాయ రంగంకు అత్యధిక ప్రాధాన్యత ప్రజా ప్రభుత్వంలో పంచవర్ష ప్రణాళిక ఏర్పాటు చేసుకొని మన ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది వ్యవసాయ రైతులకు అనేక సంక్షేమ పథకాలు ఉచిత విద్యుత్తు సబ్సిడీ ధరలకు వ్యవసాయ రంగం పనిముట్లు.ఏకకాలంలో రైతుకు రెండు లక్షల రుణమాఫీ ఇలా చెప్పకుండా పోతే రైతులకు మహిళలకు ప్రణాళికలో ప్రాధాన్యత కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన ఘనత.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం . రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి ! కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సలహాలు సూచనల మేరకే అభ్యర్థులను అధిష్టానం ప్రకటిస్తుంది ప్రతి అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ గెలిపించుకోవాలి అని అన్నారు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ అనసూయ సీతక్క.. వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులు లై కాంగ్రెస్ పార్టీలో చేరినారు వీరికి మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల పార్టీ అధ్యక్షులు.. రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు గ్రామ కమిటీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చెయ్యాలి,స్థానిక ఎన్నికలల్లో సత్తా చాటాలి

## మంత్రి సీతక్క ...

## అభివృద్ధి, సంక్షేమమే ఈ అభ్యర్థుల గెలుపు లక్ష్యం..

## .ప్రజాసేవలో అంకితభావం అభ్యర్థిలను గెలిపించుకుందాం...

## ఈసీ ఇచ్చిన రిజర్వేషన్లపై మాపై నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు...

## గంగారం మండలం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోంది...



**తెలంగాణసేన : గంగారం** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క. ఈ సందర్భముగా మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలల్లో గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి, అభివృద్ధి సంక్షేమమే ఈ అభ్యర్థుల గెలుపు లక్ష్యం, ప్రజాసేవలో అంకితభావం ఉన్న అభ్యర్థులను గెలిపించుకుందాం అదేవిధంగా ఈసీ ఇచ్చిన రిజర్వేషన్లపై మాపై నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిత్యం అసత్య ప్రచారాలు చేస్తూ విషం కక్కుతున్నారు. గంగారం మండలం నుండి కామరాం వరకు డబల్ రోడ్డు పనులు ప్రారంభించామని , గ్రామ గ్రామన సిసి రోడ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ రుణాలు వేల కోట్ల నిధులు, మేడారం కు 150 కోట్లు, మండలంలో బ్రిడ్జిల నిర్మాణానికి 8 కోట్లు, కొత్త రేషన్ కార్డులు, 50వేల పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉచిత బస్సు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పరుగెత్తుతుందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన గత ప్రభుత్వం ప్రజలకు ఇప్పటికి బాకీ పడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి,కొత్తగూడ మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, గంగారాం మండల పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు,యూత్ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, మాజీ ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, మాజీ జెడ్పిటిసి ఈసం రామా సురేష్, పార్టీ ప్రధాన కార్యదర్శులు కొమురయ్య, యూత్ అధ్యక్షులు మొడిగా విజయ్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుండాగాని శ్రీధర్, కో ఆప్షన్ ఎస్ కే సయ్యద్, సీనియర్ నాయకులు శంబయ్య, పోతయ్య, జిల్లా నాయకులు యూత్ నాయకులు కార్యకర్తలు తద తరులు పాల్గొన్నారు.

# బాసరలో పిచ్చికుక్కల స్వైర విహారం

## ఏ కాలనీలో చూసిన పిచ్చికుక్కల దాడి బాధితులే..




**తెలంగాణ సేన అక్టోబర్ 05 (బాసర ) :** నిర్మల్ జిల్లా :బాసరలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన బాలుడు అలీ అబ్దుల్లా నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఓ వీధి కుక్క దాడి చేయడంతో ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలుడికి వైద్యులు చికిత్స చేశారు. కాలనీలలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల వద్ద వీటి బెడద అధికంగా ఉంటుందని, క్షణక్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చిన్నారులు వృద్ధులు, బిక్కుబిక్కుమంటున్నారనీ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

# వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం









## – ఆర్ఎస్ఎస్ కరినగర్ మండల ఏక్ ప్రభారి విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ జక్కుల సత్యనారాయణ మూర్తి

**వేములవాడ,అక్టోబర్ 5 (తెలంగాణ సేన) :** ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ ఎస్ ఎస్ వేములవాడ ఖండ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ పురవీధుల గుండా ఆర్ఎస్ఎస్ కార్యకర్తల పథసం చలన్ జరిగింది.అనంతరం స్థానిక పద్మశాలి సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఆర్ఎస్ఎస్ కరినగర మండల ఏక్ ప్రభారి శ్రీ జక్కుల సత్యనారాయణ మూర్తి పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు, హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత,కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ,పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ మరియు పరిసర గ్రామాల స్వయం సేవకులు మరియు వివిధ సంఘ క్షేత్రాల కార్యకర్తలు పాల్గొన్నారని ఖండ కార్యవాహ శ్రీ కొండం పుల్లారెడ్డి తెలిపారు.

# పలు శుభకార్యాలలో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి









**వేములవాడ,అక్టోబర్ 5 (తెలంగాణ సేన) :** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో జరిగిన ఎల్లా రాజు రెడ్డి గారి కూతురు చి.కీర్తిమా రెడ్డి నూతన వస్త్రాలంకరణ వేడుక మరియు అగ్రహారం గ్రామానికి చెందిన ఇర్నల వారి వివాహ వేడుక, శాత్రాజు పల్లెకు చెందిన తెరాల వారి నామకరణ మహోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ,మాజీ సర్పంచ్ కొండపెల్లి వెంకటరమణారావు,మెరుగు శ్రీనివాస్, చిట్ల సతీష్, మెడికల్ రాజిరెడ్డి,వనపట్ల సందీప్ రెడ్డి, ముత్త మహేష్, ఎర్రం ముత్తయ్య, రాసురి వెంకటేష్ రాజు, ఐత వెంకటేశం,తెరాల సంతోష్ ,నాగుల సురేష్, ప్రకాష్, అనిల్ తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**కోనరావుపేట, అక్టోబర్ 5 (తెలంగాణ సేన) :** కొనరావుపేట మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు ఆదివారం కొనారావుపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య కమ్యూనిటి హాల్ లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పలు సూచనలను తెలియజేసారు..

# పాలస్తీనాకు సంఘీభావంగా ధర్నా చౌక్ వద్ద వందలాది పౌరులు







**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్:** గాజాలో గత రెండు సంవత్సరాలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని వ్యతిరేకిస్తూ 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' మరియు బీడీఎస్ ఇండియా సంయుక్తంగా నేడు ధర్నా చౌక్ వద్ద నిరసన ప్రదర్శనను నిర్వహించాయి. ఈ నిరసన దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పుణె, చండీగఢ్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో జరిగిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా జరిగింది. 21వ శతాబ్దంలోనే అత్యంత దారుణమైన మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాలస్తీనా ప్రజలకు నిరసనకారులు తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. యాక్టివిస్టులు, మేధావులు, డాక్టర్లు, విద్యార్థులు, యువత సహా వివిధ రంగాల నుండి పౌరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు ఇజ్రాయెల్‌ను ఖండిస్తూ, పాలస్తీనా ప్రజల ధైర్యవంతమైన ప్రతిఘటనకు మద్దతుగా నినాదాలు చేశారు. విప్లవ గీతాలు, కవిత్వం, పెయింటింగ్స్ కూడా ఈ నిరసనలో భాగమయ్యాయి. ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణకు సంబంధించిన చరిత్రను వివరిస్తూ ఒక కరపత్రాన్ని కూడా పంపిణీ చేశారు. నిర్వాహకుల తరఫున 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్'కు చెందిన ఆనంద్ మాట్లాడుతూ, పాలస్తీనా సమస్య మతపరమైన అంశం కాదని, మానవతా సమస్య అని ఉద్ఘాటించారు. వారి మత విశ్వాసాలతో సంబంధం లేకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాలస్తీనాకు మద్దతుగా వీధుల్లోకి వస్తున్నారు. నేడు ఇది మానవత్వానికి ఒక గీటురాయి. మానవత్వం వైపు నిలబడాలని అనుకునే వారంతా పాలస్తీనాకు మద్దతు ఇస్తూ ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించాలని గుర్తు చేసారు. ఇజ్రాయెల్ అనేది ఒక సెటిలర్ కలోనియల్ అపార్థెడ్ రాజ్యం అని, అది పాలస్తీనా భూమిని ఆక్రమించి 1948 నుండి జాతి ప్రక్షాళనకు తెగించిందని ఆయన పేర్కొన్నారు. ఇది వలసవాద చరిత్రలోనే అత్యంత దారుణమైన ఆక్రమణలలో ఒకటి. 200 సంవత్సరాలకు పైగా వలసవాదానికి గురైన భారతీయులం మనం. కాబట్టి, మనం సహజంగానే పాలస్తీనా ప్రజలకి సంఘీభావంగా నిలబడాలని డిమాండ్ చేశారు. బీడీఎస్ ఇండియా తరఫున మాట్లాడిన శ్రీజ, ఇజ్రాయెల్ యొక్క వలసవాద మరియు అపార్థెడ్ విధానాలకు వ్యతిరేకంగా దౌత్య, వాణిజ్య, విద్యా మరియు సాంస్కృతిక బహిష్కరణ లక్ష్యంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో బహిష్కరణ, పెట్టుబడుల ఉపసంహరణ మరియు ఆంక్షలు (%దీణా దీశీఎషీ, ణఱఙవర్ఎవత్ ఖఅఐ ఝఱఅష్ఱశీఅం%) అనే అంతర్జాతీయ ఉద్యమం జరుగుతోందని తెలిపారు. గత కొన్ని నెలలుగా ఈ ఉద్యమం భారతదేశంలో కూడా విస్తరిస్తోంది. గాజాలో జరుగుతున్న నరమేధానికి సహకరిస్తున్న టాటా, రిలయన్స్, మహీంద్రా, మెక్‌డొనాల్డ్స్, అడిడాస్ వంటి భారతీయ మరియు బహుళజాతి



కంపెనీల అవుట్‌లెట్ల ముందు నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇజ్రాయెల్‌తో వ్యాపారం కొనసాగిస్తున్న ఈ కంపెనీల లాభాలను మహిళలు, పిల్లలతో సహా నిరపరాధులైన పాలస్తీనియన్లను చంపడానికి ఇజ్రాయెల్ ఉపయోగిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. గాజాలో జరుగుతున్న ఈ మారణకాండకు వ్యతిరేకిస్తూ నిరసనకు చిహ్నంగా ఈ కంపెనీల ఉత్పత్తులను బహిష్కరించాలని ఆమె పిలుపునిచ్చారు.

దిశ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, నవజవాన్ భారత్ సభ మరియు ప్రొగ్రెసివ్ డాక్టర్స్ లీగ్ కూడా నిరసనలో పాల్గొని, పాలస్తీనా ప్రజలకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించాయి. 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' కి చెందిన భార్గవి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆమె డిమాండ్ల జాబితాను చదివి వినిపించారు. భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో అన్ని రకాల దౌత్య మరియు వాణిజ్య సంబంధాలను తక్షణమే తెంచుకోవాలనేది ప్రధాన డిమాండ్‌గా ప్రకటించారు. పాల్గొన్నవారు చేతులు పైకెత్తి డిమాండ్లకు తమ ఆమోదం తెలిపారు. ఇజ్రాయెల్ వలసవాదానికి వ్యతిరేకంగా పాలస్తీనా జాతీయ విముక్తికి మద్దతుగా జరిగే ఈ ఉద్యమాన్ని భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని, రాబోయే రోజుల్లో 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' మరియు బీడీఎస్ ఇండియా మరిన్ని ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నాయ్.

# స్థానిక సంస్థల ఎన్నికలు మరో నెల రోజులు ఆపాలి !

## గవర్నర్ కి పంపిన బిల్లులు మూడు నెలలు గడిస్తే అవి ఆమోదం పొందినట్లు అవుతుంది

## ఆ బిల్లుల ప్రకారంగా ఎన్నికలు నిర్వహించవచ్చు !



**మంచిర్యాల, తెలంగాణ సేన న్యూస్:** బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్రం సీనియర్ నాయకులు కోదూరి చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పట్టుదలతో ఉన్న పక్షంలో అసెంబ్లీ ఆమోదం పొందిన బిల్లుపై గవర్నర్ గారు నిర్ణయం తీసుకునే గడువు వరకు వేచి ఉంటే బాగుంటుందనీ. అధికార పార్టీ నేతలు చెబుతున్న విధంగా పెండింగ్ బిల్లులపై రాష్ట్రపతి గవర్నర్లు మూడు నెలల్లోగా తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. లేదంటే ! అవి ఆమోదం పొందినట్లు భావించాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు చెప్పిన విషయం తెలిసిందే ! కాగా మొదటి రెండు పర్యాయాలు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు ఆర్డినెన్సు రాష్ట్రపతి వద్ద పెండింగ్లో ఉన్నాయి. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో 50% పరిమితికి మించి రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీ ఆమోదించిన బిల్లు గవర్నర్ గారి వద్ద పెండింగ్లో ఉంది. మరో 25 రోజులైతే ఆ బిల్లును పంపి 90 రోజులు అవుతుంది అందువల్ల దీనితోపాటు సుప్రీంకోర్టు, రాష్ట్రపతి నుంచి వచ్చే స్పందనల కోసం మరో నెల వేచి చూస్తే బాగుంటుందని ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తరపున కోరుతున్నామనీ అన్నారు. ఇప్పటికే రెండు సంవత్సరాల నుంచి ఆగిన స్థానిక సంస్థల ఎన్నికలు మరొక నెల రోజులు ఆగగానే నష్టపోయేది ఏమీ లేదు కాబట్టి బీసీ కులాల వారికి రిజర్వేషన్లలో న్యాయం జరగాలంటే తప్పనిసరిగా రిజర్వేషన్లు అమలు కావలసిన అవసరం ఉన్నది. అని చంద్రయ్య గారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో-కన్వీనర్ కడార్ల నరసయ్య గారు, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ శ్రీరాముల కొండయ్య గారు, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంద్ర పురుషోత్తం గారు, మహేంద్ర సంఘం జన్నారం మండల నాయకుడు కోడిజుట్టు రాజయ్య గారు, జన్నారం మండల పూసల సంఘం మాజీ అధ్యక్షుడు గుడ్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడింగ్.. ట్రెండింగ్..!



## సైబర్ మోసాలపైనే సగం ఫిర్యాదులు

## ఆన్‌లైన్‌లో ప్రకటనలతో ఈజీగా దోపిడీ

**తెలంగాణ సేన న్యూస్: హైదరాబాద్:** సోషల్‌మీడియాలో విచ్చలవిడిగా ప్రకటనలు ఇస్తూ, సైబర్‌నేరగాళ్లు అమాయకులకు వల వేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. దీంతోనే ట్రేడింగ్ మోసాలు నేడు ట్రెండింగ్‌గా మారాయి. సోషల్‌మీడియానే కాదు.. సాధారణంగా ఉపయోగించే యాప్‌లు.. ఇతర వెబ్‌సైట్లలోనూ ట్రేడింగ్ ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ట్రేడింగ్‌లో ఏఐని కూడా ఉపయోగిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

నేడు వెబ్‌లో ప్రకటనలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ప్రకటనలపై రూ.లక్ష పెట్టుబడి పెడితే, వాటిని నమ్మిన అమాయకుల నుంచి రూ.కోట్లు కొట్టేస్తూ సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలొస్తాయంటూ ఎక్కువగా ఈ ప్రకటనలు ఇస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్‌తోపాటు వివిధ రకాల సేవలు అందించే యాప్‌లు, వెబ్‌సైట్లలో ట్రేడింగ్‌కు సంబంధించిన రోజుకో కొత్త ప్రకటన దర్శనమిస్తోంది.

గూగుల్, ఫేస్‌బుక్ యాడ్ ప్రమోషన్లతోపాటు ఇతర ప్రముఖ సర్చ్ ఇంజన్లు, పేరున్న వెబ్‌సైట్లలో సైబర్‌నేరగాళ్లు వివిధ రకాలైన ప్రకటనలు ఇస్తున్నారు. ఈ ప్రకటనలు ఆకర్షణీయంగా ఉంటూ ఈజీగా అమాయకులను నమ్మించే విధంగా ఉంటున్నాయి. సోషల్‌మీడియాలో ప్రకటనలు, ఏఐని కూడా ఉపయోగిస్తూ ప్రముఖుల వీడియోలతో పోస్టులు పెడుతున్నారు. ఈ ప్రకటనలు చూసి చదువుకున్న అమాయకులను సైబర్‌నేరగాళ్లు ఈజీగా బోల్తా కొట్టిస్తున్నారు.

ప్రతిరోజూ సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కుతూ రూ.కోట్లు పోగొట్టుకుంటున్న వారిలో చాలామంది సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలతోను ఆకర్షితులవుతూ మోసపోతున్నారు. సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదులలో రోజు సగం వరకు ట్రేడింగ్‌లో మోసపోయిన బాధితుల కేసులే ఉంటున్నాయి.

గేమింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్లే కొందరు ట్రేడింగ్ వ్యాపారాలను కూడా ప్రమోట్ చేస్తున్నారు. ఇదంతా సైబర్‌నేరగాళ్లు పక్కా ప్లాన్‌తో చేస్తున్న మోసాలు. ట్రేడింగ్ అంటే ఎంతో కొంత అవగాహన ఉన్న వాళ్లు, ఇలాంటి ప్రకటనలు చూడడం, మార్ఫింగ్ వీడియోలు వినడంతో ప్రేరేపితమవుతూ సైబర్‌నేరగాళ్ల వలలో ఈజీగా చిక్కుతున్నారు. విదేశాలలో అడ్డాలు ఏర్పాటు చేసుకొని సైబర్‌నేరగాళ్లు ఈ మోసాలకు పాల్పడుతున్నారు.

### మన అత్యాశే మోసగాళ్లకు పెట్టుబడి

యాడ్ ప్రమోషన్‌లో ఏదీ నిజం, ఏదీ అబద్ధం, ఏదీ మోసం అనే విషయాలను ఆయా సంస్థలు పట్టించుకోవు. ప్రకటనను పబ్లిష్ చేయడమే తమ పని అనే విధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రకటనలు ఇచ్చే ముందు సైతం సైబర్‌నేరగాళ్లు ముందస్తు ప్రణాళికలతో ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఒక రూ.లక్షతో యాడ్ ప్రమోట్ చేశారంటే.. ఆయా వెబ్‌సైట్లు, యాప్‌ల విజిటర్స్‌ను బట్టి, ప్రకటన వీడియో సమయాన్ని బట్టి ప్రకటనల ధరలు ఉంటాయి.

ఒకో క్లిక్‌కు ఒక్కో రేటు ఉంటుంది. సాధారణంగా ఒక క్లిక్‌కు సాధారణ ప్రకటనకు రూ. 100 వరకైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉంటారు, అలాంటి రూ.లక్ష పెట్టుబడి పెడితే వెయ్యి మంది వరకు క్లిక్ చేసే అవకాశాలుంటాయి. అందులో కనీసం వంద మంది ఆ ప్రకటనలకు ఆకర్షితులై పది మంది ట్రేడింగ్‌కు ముందుకు వచ్చారంటే సైబర్‌నేరగాళ్ల పంట పండినట్లే. ఆ పది మందే లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు నమ్మి మోసపోతుంటారని, మోసంతో వచ్చిన సొమ్ముతో భారీగా ప్రకటనలు ఇస్తూ అమాయకులను సైబర్‌నేరగాళ్లు ఆకర్షిస్తున్నారంటూ నిపుణులు పేర్కొంటున్నారు.

ఒక సారి బాధితుడు ఆకర్షితుడై అందులో ఉన్న నెంబర్లను కాంటాక్టు చేశాడంటే ఆ తరువాత వాట్సాఫ్, టెలిగ్రామ్ గ్రూప్‌లో వారి నెంబర్లు చేర్చి అక్కడి నుంచి మోసం చేయడం ప్రారంభిస్తుంటారు. ట్రేడింగ్ మోసాలలో సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలే వారి పెట్టుబడి. మొదట్లో మాటలు చెప్పి అమాయకులను బుట్టలో వేశారంటే ఆ తరువాత బాధితుడే అందులో కూరుకుపోయి డబ్బులు పెట్టుబడి పెడుతూ మోసానికి గురవుతుంటాడు. ఇందుకు మొదట మాటలు, ఆ తరువాత వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌లలో ట్రేడింగ్‌లో నిష్ణాతులైన వారితో చర్చలు, సూచనలంటూ మాయ మాటలు చెబుతుంటారు.

ఆయా గ్రూప్‌లలో ఉండేవారిలో సగం మంది సైబర్‌నేరగాళ్లే ఉంటారు. మన అదృష్టాన్ని పరీక్షించుకుందామని మొదట్లో తక్కువ పెట్టుబడితో ట్రేడింగ్ మొదలు పెడుతారు. వెంటనే లాభాలొచ్చాయంటూ సైబర్‌నేరగాళ్లు తమ సొంతంగా బాధితులకు డబ్బులు ఇస్తారు. ఇలా డబ్బులు ఇచ్చిన తరువాత నుంచి నెమ్మదిగా మోసంలోకి దింపుతుంటారు. ప్రధానంగా సోషల్‌మీడియాలో వచ్చే ప్రకటనలు, సోషల్‌మీడియా గ్రూప్‌లలో ట్రేడింగ్ గూర్చి చర్చలు జరిపి అమాయకులను మోసం చేస్తుండంతో ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# సిటీ బస్సు చార్జీల పెంపు

## పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపిన కాంగ్రెస్

## ఓట్లెయ్యలేదనే పగతోనే నగరవాసులపై రేవంత్ కక్ష

## ప్రయాణికుల జేబులు కొల్లగొట్టేందుకు సర్కార్ కుట్ర

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

**తెలంగాణ సేన న్యూస్:, హైదరాబాద్ :** పేద, మధ్య తరగతి వర్గాలు ప్రయాణించే సిటీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇప్పటికే విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు, టీ-24 టికెట్ల రేట్లను పెంచిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా సిటీ బస్సు చార్జీలను 50 శాతానికి పైగా స్టేజీకి పది రూపాయలు పెంచడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతినెలా ఒక్కో ప్రయాణికుడిపై సుమారు రూ. 500కు పైగా భారం పడుతుందని వాపోయారు. కాంగ్రెస్ సర్కారు అసమర్థ పాలన, అసంబద్ధ విధానాలతో నష్టాలపాలైన ఆర్టీసీని గట్టెక్కించేందుకు చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నదని ఫైర్ అయ్యారు. ప్రభుత్వ దుర్మార్గమైన నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులు కొల్లగొట్టేందుకు పన్నిన కుట్ర అని నిప్పులు చెరిగారు. మూలిగే నక్కపై తాటి పండు చందంగా ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో అల్లాడుతున్న తరుణంలో సిటీ బస్సు చార్జీలు పెంచి మరో పిడుగు వేశారని విమర్శించారు.



# కాంగ్రెస్ పార్టీలో పలువురు మాజీ సర్పంచులు చేరిక

## కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





**కోనరావుపేట , అక్టోబర్ 5 (తెలంగాణ సేన) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి మాజీ సర్పంచ్ కొక్కుల నర్సయ్య-భారతి, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు సంకోజి సత్తయ్య, శివంగల పల్లి మాజీ సర్పంచ్ సురేష్ సుమారు 50 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

# జూబ్లీహిల్స్ కాంసెన్సీ రహమత్ నగర్‌లో మంత్రులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న సీ న్ రెడ్డి




**తెలంగాణ సేన న్యూస్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రైమాత్ నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్ నగర్ ఫంక్షన్ హాల్ లో ముస్లింలకు కబరస్థాన్ ఏర్పాటు విషయంపై నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.ముస్లిం సమాజానికి షేక్‌పేట్‌లో 2,500 గజాల స్థలాన్ని కేటాయిస్తూ, జేఏసీ ప్రతినిధులకు అధికారికంగా అప్పగించడం జరిగింది..ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , మైనార్టీ చైర్మన్ ఫయుమ్ కురైసి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుసేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజారుద్దీన్, నవీన్ యాదవ్, అలాగే పలు చైర్మన్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాజన్నను దర్శించుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ..

**వేములవాడ,అక్టోబర్ 5 (తెలంగాణ సేన) :** వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితుడు ఆలయ అర్చకులు స్వామివారి శేషం వస్త్రం కప్పి లడ్డు ప్రసాధం అందజేసి ఆశీర్వచనం చేశారు.



# ముప్పై ఏళ్ల తర్వత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**శాలిగౌరారం అక్టోబర్ 05 తెలంగాణ సేన :**శాలిగౌరారం మండలం మాదవరం కలాన్ ఉన్నత పాఠశాల 1994-95 ఎస్ ఎస్ సి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ముప్పై సంవత్సరాల తరువాత పెరక కొండారం లోని ఒక ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.. ఈ సందర్భంగా పాఠశాల దినాలు, గురువులు, స్నేహితులు మన హృదయంలో మరపురాని గుర్తులుగా నిలిచిపోయాయని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం మనలోని పాత స్నేహాలకు మళ్లీ ప్రాణం పోసిందని నిన్నటి ఆటలు, నవ్వులు, పాఠాలు, శిక్షలు ఇవన్నీ మళ్లీ మన కళ్లముందు నాట్యం చేస్తున్నాయి అన్నారు.. ఈ ఆనందానికి కారణమైన ప్రతి ఒక్కరికి గురువులకీ, నిర్వాహకులకీ, పూర్వవిద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చిన్ననాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. అనంతరం అట పాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు వీరయ్య, అశోక్ రెడ్డి, నర్సింహా రెడ్డి, వెంకట్ రెడ్డి పూర్వ విద్యార్థులు కుంభం జానయ్య, రంగు బిక్షం, అన్నెబోయిన సైదులు, కప్పల రమేష్, రంగు జానయ్య శ్రీనివాస్, వెంకన్న, లింగయ్య, తిరుమల్ రెడ్డి, ఉమారాని, సైదమ్మ, గంగదారి శ్రీనివాస్,బత్తుల లింగయ్య, మసరం రమేష్,మెండే నరేందర్, జేరిపోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాక జయంతి వేడుకలు






**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి అక్టోబర్ 05 :** ఈరోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో గౌరవనీయులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వోడితల ప్రణవ్ గారి ఆదేశానుసారముగా కాక జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్యలో చాలా ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి..కాకా పేరు యావత్ భారతదేశంలో, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో తెలియనివాళ్లు ఉండరు. ఒక సాధారణ పేద కుటుంబంలో జన్మించి చిన్నతనం నుంచే కార్మికుల, కర్షకుల కష్టాలు దగ్గర నుంచి చూసి ఎలాగైనా కార్మికుల జీవితాల్లో వెలుగు నింపాలని కంకణం కట్టుకున్న యోధుడు. ఆయన ప్రస్థానం భవన నిర్మాణ కూలీగా మొదలైంది.ఆయనకు 20 ఏండ్లు నిండకముందే ఎన్నో పోరాటాలు చేశాడు.భవన నిర్మాణ కూలీగా,తెలంగాణ ఉద్యమకారుడిగా మొదలైన ఆయన జీవితం కార్మిక నాయకుడి నుంచి ఎంపీగా, కేంద్ర మంత్రిగా జాతీయ స్థాయికి చేరింది. కేంద్ర మంత్రిగా కార్మికుల పక్షపాతిగా ఆయన ఎన్నో సేవలు చేశాడు. తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాలలో కాకా అని గుర్తింపు పొందిన వెంకటస్వామి కీలకపాత్ర వహించాడు.స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ సాధన ఉద్యమం దాకా అన్నింట్లోనూ వెంకటస్వామి పాల్గొన్నారు అని అన్నారు.